సీఎం రేవంత్‌రెడ్డికి రాజన్న ప్రసాదం అందజేసి ఆశీర్వదిస్తున్న ఇన్‌చార్జి స్థానాచార్యుడు నమిలికొండ ఉమేశ్, అర్చకులు, పక్కన విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విప్

- రాజన్న ఆలయానికి బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయింపుపై హర్షం
- స్వామివారి ప్రసాదం అందించి.. ఆశీర్వదించిన అర్చకులు

వేములవాడ, ఆగస్టు 30: సచివాలయంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని రాజన్న ఆలయ అర్చకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. రాజన్న ఆలయాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యుడు నమిలికొండ ఉమేశ్, అర్చకులు ఈశ్వరగారి సురేశ్, గోపన్నగారి చందు సీఎంకు స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. అంతకుముందు చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తీసుకోవాల్సిన అనుమతులపై దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యార్, సీఎం ఓఎస్‌డీ శ్రీనివాసులు, సీఎం కార్యదర్శి అజిత్‌రెడ్డి ఆలయ అధికారులతో చర్చించారు. వారంపది రోజుల్లో శృంగేరి పీఠాధిపతి అనుమతి కోసం వెళ్లేందుకు ప్రతిపాదన చేశారు. సెప్టెంబర్ మొదటివారంలో ఆలయాన్ని దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శితోపాటు కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శిస్తామని తెలిపారు. ఇక్కడ రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయశాఖ స్థపతి వల్లియాగం, అర్చకుడు వెంకన్న, ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 30: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో 9, 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి పీ లక్ష్మీరాజం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇంటర్, ఒకేషనల్, ప్రొఫెషనల్, డిగ్రీ ఆ పై తరగతులు/కోర్సు, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు సైతం సెప్టెంబర్ 31లోగా వెబ్‌సైట్‌లో (www.scholorships.gov.in లేదా www.depwd.gov.in) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం కలెక్టరేట్‌లోని సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బాలపురస్కార్ అవార్డుల కోసం..

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2024 అవార్డుల కోసం ప్రతిభ గల బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి పీ లక్ష్మీరాజం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సాంస్కృతిక తదితర రంగాల్లో ప్రతిభ చూపిన 5 నుంచి 18ఏండ్ల లోపు బాలబాలికలు నేడు(శనివారం) వెబ్‌సైట్‌లో (https://awards.gov.in) దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

టీచింగ్ పోస్టులకు ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 30: మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో టీచింగ్ పోస్టులు, గెస్ట్ ఫ్యాకల్టీని తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 9లోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీల సంక్షేమ కార్యాలయంలో విద్యార్హత, బయోడేటా కాపీలను సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను (99497 71639) సంప్రదించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝావెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

అమ్మబడును

★ కరీంనగర్ టవర్‌కు 1 కి.మీ దూరంలో బొమ్మకల్ వెళ్లే రోడు గోదావరిఖని-హైదరాబాద్ హైవే దగ్గర వరహస్వామి గుడి వద్ద కృష్ణానగర్ చౌరస్తాలో 20 గజముల షట్టర్ షాపులు అమ్మబడును. సెల్: 95736 10777, 70590 68888.
NTK-325564

పేరు మార్చబడినది

నేను, **సందవేణి మహేష్** S/o. **కొమురయ్య,** R/o. Q.No: ST2-2044, 8 ఇంక్లైన్ కాలనీ, మం: రామగుండం, జి: పెద్దపల్లి, TG అను నా యొక్క పేరు ఇక నుండి **సందినేని మహేందర్** S/o. **కొమురయ్య** అని తెలంగాణ రాజప్రతం (No: 214) ద్వారా మార్చబడింది.

PLOT FOR SALE

★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

సెస్‌పై బకాయిల భారం

- బిల్లులు చెల్లించని సర్కారు
- మొత్తం బకాయిలు ₹765.43 కోట్లు
- సర్కారు బకాయిలు ₹615 కోట్లు

సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ సెస్‌ను బకాయిల భారం వెంటాడుతున్నది. గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు చెల్లించాల్సిన వీధిలైట్ల బిల్లులు విడుదల చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నది. సంస్థకు మొత్తం ₹765.46 కోట్లు బకాయిలుండగా, అందులో ₹635.43కోట్లు సర్కారే చెల్లించాల్సి ఉన్నది. బకాయిలు వసూలుకాక సంస్థ నష్టాల్లో కూరుకుపోతున్నదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది.

- రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ)

జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ కార్యాలయం

వినియోగదారుల వాటాధనంతో 1970 లో సిరిసిల్లలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ ఏర్పడింది. 2.98లక్షల మంది వినియోగదారులతో 2.56లక్షల విద్యుత్ కనెక్షన్లు కలిగి ₹6,14.81 కోట్ల పైచిలుకు సభ్యుల వాటాధనంతో సేవలందిస్తున్నది. సుమారు 70వేల విద్యుత్ కనెక్షన్లు వ్యవసాయ రంగానికి ఇచ్చిన ఘనత సెస్‌కు ఉన్నది. మరో వైపు వస్త్ర పరిశ్రమకు కేంద్ర బిందువైన సిరిసిల్లలో 30వేల పైచిలుకున్న మరమగ్గాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నది. గతంలో రాష్ట్రంలో తొమ్మిది సహకార విద్యుత్ సరఫరా సంస్థలు ఉండగా, చాలా వరకు ప్రభుత్వంలో బోర్డులో విలీనంచేసింది. సెస్ అభివృద్ధి, వినియోగదారులకు అందిస్తున్న సేవలను చూసిన విదేశీ సంస్థలు ప్రశంసలు కురిపించాయి.

బకాయిల్లో సింహభాగం సర్కారువే

సెస్ సంస్థకు మొత్తం బకాయిలు ₹765.43 కోట్లు ఉన్నాయి. అందులో సింహభాగం సర్కారువే ఉన్నాయి. సెస్ పరిధిలోని 13 మండలాల్లో కలిపి 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాల్టీలున్నాయి. వీధి దీపాలు, రజకులు, నాయీబ్రాహ్మణులు, మరమగ్గాల సబ్సిడీలు ఇలా సర్కారు చెల్లించాల్సిన ₹635.43కోట్లు ఉన్నాయి. వీటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో సంస్థను నడపడం భారమైతుందని అధికారులు చెబుతున్నారు. సెస్ పరిధిలోని వివిధ పరిశ్రమలతోపాటు మరమగ్గాలకు చెందిన ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి ₹20.20కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించి సబ్సిడీ ₹89.94కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా సబ్సిడీలకు చెందిన నయాపైసా ఇప్పటి వరకు చెల్లించలేదు. ఎప్పుడు వస్తాయన్నది నమ్మకం కూడా లేదు. కాగా వస్త్ర పరిశ్రమకు చేయూతనిచ్చి, కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరమగ్గాలకు యూనిట్ సబ్సిడీతో ₹2 కే ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్సిడీని ఎత్తివేసింది. యూనిట్ ₹2ఉన్న ధరను ₹8.50కి పెంచింది. విద్యుత్ బిల్లులు భారమయ్యాయి. మరో వైపు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడం, కరెంటు బిల్లులు భారమవ్వడంతో వస్త్ర ఉత్పత్తిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన పరిశ్రమపై దయచూపి విద్యుత్ సబ్సిడీ కొనసాగిస్తుందన్న ఆశతో యజమానులు, ఆసాములు ఉన్నారు. అయితే వాటికి సర్‌చార్జీలు పడు తూ మరింత భారమైపోతున్నాయి.

విలీనంపై కుట్ర

ట్రాన్స్‌కో నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి వినియోగదారులకు సెస్ విక్రయిస్తున్నది. బకాయిలు పెండింగ్ పడుతున్నా ట్రాన్స్‌కోకు మాత్రం యథావిధిగా డబ్బులు చెల్లిస్తూ వస్తున్నది. ₹765.43కోట్ల బకాయిలుండి, అప్పుల్లో కూరుకుపోయి నష్టాల్లో నడుస్తుందన్న సాకు చూపి ఎన్‌పీడీసీఎల్‌లో సంస్థను విలీనం చేయాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ (ఈఆర్‌సీ) ఫిబ్రవరిలో ప్రభుత్వానికి నివేదికలు పంపించింది. ₹765.43 కోట్లతో వాస్తవానికి సంస్థకు చెల్లించాల్సిన అప్పుల్లో ప్రభుత్వానికి చెందిన బిల్లులే ₹635.43 కోట్లు ఉన్న సంగతి నివేదికలో పేర్కొనలేదు. ఇప్పటికైనా బకాయిలు సకాలంలో విడుదల చేసి సెస్‌ను కాపాడాలని వినియోగదారులు కోరుతున్నారు.

బకాయిల వివరాలు..

- వినియోగదారులు ₹130కోట్లు
- మరమగ్గాల ఎస్ఎస్ఐ యూనిట్లు ₹.20.20కోట్లు
- మరమగ్గాల సబ్సిడీ ₹89.94 కోట్లు
- గ్రామ పంచాయతీ, మున్సిపాల్టీ వీధి దీపాలు ₹319 కోట్లు.. వ్యవసాయరంగ సబ్సిడీ ₹174.05కోట్లు
- రజకుల సబ్సిడీ ₹5.26కోట్లు నాయీబ్రాహ్మణుల సబ్సిడీ ₹15లక్షలు

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి

వేములవాడ, ఆగస్టు 30: వేములవాడ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సుల్తానాబాద్, కరీంనగర్‌లో విధులు నిర్వర్తించిన రాజిరెడ్డి డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా వేములవాడ సబ్ రిజిస్ట్రార్ సురేంద్రబాబు ఎల్లారెడ్డికు బదిలీ అయ్యారు. డీఐజీ కార్యాలయం నుంచి దాదాపు నెల రోజుల తర్వాత వేములవాడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు కేటాయించకపోగా, శుక్రవారం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి, ఆగస్టు 30: శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా ప్రాజెక్టుకు 11,061 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా,ఎల్ఎండీకి 21,150 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెళ్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 15.526 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఎంఈవోలను నియమించాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు30: ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని టీఆర్టీఎఫ్ జిలా అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టి, మాట్లాడారు. పీఎస్ హెచ్ఎం పదోన్నతికి బీఈడీ అర్హత గల ఎస్జీటీలకు అవకాశం కలిగించేందుకు జీవో నంబర్ 11, 12 సవరించాలని కోరారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, మండల అధ్యక్షుడు గుగులోత్ రమేశ్, పోతుగంటి రమేశ్, సురేందర్‌నాయక్ ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ

గంభీరావుపేట, ఆగస్టు 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు టాస్క్, కెరీర్ గైడ్ ఇన్‌సెల్‌పై మూడు రోజులపాటు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ శ్రావణ్ విద్యార్థులకు కంప్యూటర్ లాంగ్వేజ్, మిషన్ లెర్నింగ్, వెబ్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రాజన్నపేటలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: రాజన్నపేటకు చెందిన రానవేణి దుర్గవ్వ ఇంటిలో చోరీ జరిగిన ఘటన గురువారం రాత్రి వెలుగుచూసింది. దుర్గవ్వ తిమ్మాపూర్‌లో తన బంధువు మృతిచెందగా, మంగళవారం వెళ్లి గురువారం రాత్రి వచ్చింది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా, తలుపులు పగులగొట్టి, బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించింది. బీరువాలోని రెండున్నర తులాల బంగారం, 50తులాల వెండి, రూ.10వేలు నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రమాకాంత్ వివరాలు సేకరించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలిపిన అజెండా వివరాలను చైర్‌పర్సన్ జిందం కళ వెల్లడిస్తారని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన ముగ్గురి వివరాలను శుక్రవారం వెల్లడించారు. బొప్పాపూర్‌కు చెందిన అనరాసి కిష్టయ్య దొంగిలించిన పాత ఇనుప సామగ్రి కొనకుండా బైండోవర్ చేసినప్పటికీ.. నిబంధనలు అతిక్రమించడంతో రూ.25వేల జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే బెల్టుషాపు నిర్వహిస్తున్న అక్కపల్లికి చెందిన మందాటి సతీశ్‌కు రూ.10వేలు, బొప్పాపూర్‌కు చెందిన బొమ్మనవేని పరశురాములుకు రూ.25వేల జరిమానా విధించామని తెలిపారు.

ఈజీఎస్ పనులపై గ్రామసభ

రుద్రంగి, ఆగస్టు 30: మండల కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులపై శుక్రవారం జీపీ ఆవరణలో ఏపీవో రాజయ్య ఉపాధిహామీపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సోషల్ అడిట్ నిర్వహించినట్టు తెలిపారు. పనులకు వచ్చిన నగదు చెల్లింపుల వివరాలను గ్రామస్తులకు వివరించారు. ఇక్కడ టీఏ ధనుంజయ్, కార్యదర్శి రాందాస్, తదితరులు ఉన్నారు.

డీజేలు నడిపిస్తే చర్యలు

తెలంగాణ చౌక్, ఆగస్టు30: అనుమతి లేకుండా డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం హెచ్చరించారు. పెద్దూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుకు అడ్డంగా డీజే పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగించిన దొంతరవేణి నవీన్, మల్లేశ్, రంజిత్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించి డీజేను సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- చందుర్తిలో బాలుర వసతిగృహం, ప్రాథమిక పాఠశాల తనిఖీ

చందుర్తి, ఆగస్టు 30: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. ప్రతిఒక్కరూ కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం, ప్రాథమిక పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహంలో కిచెన్‌గదులు, స్టోర్‌రూమ్, టాయిలెట్స్, రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో స్వచ్ఛత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల వివరాలు అడగడంతో 35మంది ఉన్నారని డీఎస్‌సీడీవో విజయలక్ష్మి చెప్పారు. అక్కడి నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో విద్యార్థులు ముందుండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఇక్కడ డీఈవో రమేశ్‌కుమార్, డీఎస్‌సీడీవో విజయలక్ష్మి ఉన్నారు.

కలెక్టరేట్: ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన

కలెక్టరేట్, ఆగస్టు 30: మిషన్ 100 అనే కార్యక్రమాన్ని చేపట్టి ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందేలా సిద్ధం చేసిన దమ్మన్నపేట భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు తాడూరి సంపత్ కుమార్ ఇటీవల ప్రతిష్ఠాత్మక రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని కలెక్టర్ అభినందించారు. ఇక్కడ డీఈవో రమేశ్ కుమార్, హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, జిల్లా సైన్స్‌అధికారి దేవయ్య, తదితరులు ఉన్నారు.

రుణమాఫీ వివరాలపై సర్వే

వేములవాడరూరల్, ఆగస్టు30: వేములవాడ మండలం మారుపాక, శాత్రాజుపల్లి, వట్టెంల గ్రామాల్లో రుణమాఫీ వివరాలపై సర్వే చేసినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్‌బేగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ, రుణమాఫీ కానీ అర్హులైన రైతుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏడీఏ రామారావు, ఏవో సాయికిరణ్, ఏఈవోలు ఇనామిల్, రాజు, మసూద్, తదితరులు ఉన్నారు.

రుణమాఫీ అర్జీల స్వీకరణ

బోయినపల్లి, ఆగస్టు 30: దుంద్రపల్లి, కోరెం, బూర్గుపల్లి గ్రామాల్లో రుణమాఫీ కోసం రేషన్‌కార్డులు లేని రైతుల నుంచి శుక్రవారం అర్జీలు స్వీకరించినట్లు ఏవో ప్రణీత తెలిపారు. రేషన్‌కార్డులు లేని రైతు కుటుంబాల నుంచి అర్జీలు స్వీకరించి.. ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఆమె చెప్పారు.

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వేములవాడ టౌన్: మహాలక్ష్మి అమ్మవారికి ఒడి బియ్యం పోస్తున్న మహిళలు

కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వేములవాడ టౌన్, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి మహిళలు పూజలు చేశారు. ఉదయం ఆలయంలోని పార్వతీ రాజరాజేశ్వరి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రాజన్న ఆలయం నుంచి అర్చకులు భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా మహాలక్ష్మీ ఆలయానికి వెళ్లి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పట్టణ మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేసి.. ఒడి బియ్యం పోసి ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుని మురిసిపోయారు.

సామూహిక కుంకుమ పూజలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 30: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. శ్రావణ చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు.

గంభీరావుపేట, ఆగస్టు30: మండల కేంద్రంలోని నాయకమ్మ ఆలయాల్లో మున్నూరుకాపు సంఘ మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. నాగంపేట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్నూరుకాపు సంఘ జిల్లా అధ్యక్షుడు దేవయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, నాయకులు కూర సురేశ్, పాపాగారి వెంకటస్వామిగౌడ్, గంద్యాడపు రాజు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో సందడి

వేములవాడ టౌన్, ఆగస్టు 30: రాజన్న క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వేకువ జాము నుంచే భక్తులు కోడెమొక్కు చెల్లించుకున్నారు. 20వేలకుపైగా స్వామివారిని దర్శించుకోగా, ఆర్జిత సేవల ద్వారా రూ.14లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ చెప్పారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై చెత్త వేసిన వ్యాపార సముదాయాల నిర్వాహకులకు మున్సిపల్ అధికారులు జరిమానాలు విధించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో అధికారులు, సిబ్బంది పట్టణంలోని లేబర్‌అడ్డా, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మున్సిపల్ వాహనాలకు చెత్తను అందించకుండా నిర్లక్ష్యంగా రోడ్లపై వేసిన పలువురు వ్యాపారికి రూ.500, మరొకరికి రూ.వెయ్యి జరిమానా విధించారు. మరోసారి పునరావృతమైతే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇక్కడ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, శేఖర్, దేవయ్య, రాజు, తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు: ఎస్పీ

హోంగార్డు మల్లయ్యను సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, ఆగస్టు 30: అంకితభావంతో పని చేస్తే భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్‌శాఖలో 34 ఏండ్లపాటు సేవలందించిన హోంగార్డు మల్లయ్య ఇటీవల పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం శాలువతో సన్మానించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వచ్చిన తమను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఏఎస్పీ చంద్రయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వడ్డీ వ్యాపారస్తులపై కొరడా

- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు

తనిఖీలు చేస్తున్న పోలీస్ అధికారులు

తెలంగాణ చౌక్, ఆగస్టు 30: అనుమతులులేకుండా డైలీ ఫైనాన్స్ నిర్వహిస్తూ సామాన్య ప్రజాలను ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో అక్రమ వడ్డీ వ్యాపారస్తులపై తనిఖీలు చేసిన వివరాలను ఎస్పీ తెలిపారు. తనిఖీల్లో 16మందిపై కేసులు నమోదు కాగా, రూ.8.60లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. 43బ్లాంక్ చెక్కులు, 36ప్రాంసరీ నోట్లు గుర్తించినట్లు తెలిపారు. అక్రమ వడ్డీ వ్యాపారస్తులు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తూన్న నేపథ్యంలో అట్టి వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా అక్రమ వడ్డీ వ్యాపారం చేసే వారి వివరాలను నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గానీ, డయల్ 100 ద్వారా గానీ సమాచారం అందించాలని సూచించారు.

అభివృద్ధి పనులపై తాత్సారం వద్దు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: మండలంలో జరిగే అభివృద్ధి పనులపై తాత్సారం వద్దని జడ్పీసీఈవో వినోద్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఈ క్రమంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ఇక్కడ ఎంపీడీవో సత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కోనరావుపేట, ఆగస్టు 30: మరిమడ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించిన ప్రమోషన్‌పై వెళ్తున్న ఈగ శ్రీనివాస్, కదిరె గంగాధర్‌తోపాటు బదిలీపై వెళ్తున్న పద్మజ, పద్మజను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశం, ఏపీసీ చైర్‌పర్సన్ నందిని, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

కార్యవర్గం ఎన్నిక

ముస్తాబాద్, ఆగస్టు 30: ముస్తాబాద్ పట్టణంలో మాతృశ్రీ గార్డెన్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ మండల కార్యవర్గాలను శుక్రవారం ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చేపూరి అశోక్, బజరంగ్ దళ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో కన్వీనర్ కన్నం శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడిగా గూడెం దేవేందర్, బజరంగ్‌దళ్ అధ్యక్షుడిగా ప్రశాంత్(కిట్టు), గోరక్షక్ దళ్ మండలాధ్యక్షుడిగా చేపూరి రాకేశ్, ముస్తాబాద్ నగర సంయోజక్‌గా మద్దికుంట రమేశ్‌తోపాటు పలువురిని సభ్యులుగా ఎన్నికయ్యారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

బోయినపల్లి, ఆగస్టు 30: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో జయశీల కోరారు. శుక్రవారం నర్సింగాపూర్ జడ్పీ పాఠశాలలో మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌ను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొని సత్తాచాటాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన డ్రిల్ మాస్టర్లు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల మానసికోల్లాసానికి ఆటల పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు, ఎంఎన్‌వో శ్రవణ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ప్రజలందరూ కలిసిమెలసి ఉండాలి

వీర్నపల్లి, ఆగస్టు30: ప్రజలందరూ కలిసిమెలసి ఉండాలని ఆర్ఐ ప్రవీణ్ సూచించారు. కంచర్ల గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎవరైనా కుల వివక్షకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేములవాడ రూరల్, ఆగస్టు 30: ఫాజుల్‌నగర్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించగా, డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ అంజద్‌తోపాటు కార్యదర్శి పాల్గొన్నారు. కులమత బేధం లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎవరైనా కులం పేరుతో దూషిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోయినపల్లి, ఆగస్టు 30: మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం సివిల్‌రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రజలెవరూ కుల వివక్షత చూపించవద్దన్నారు. ఇక్కడ మండల పరిషత్ సూపరిండెంటెంట్ రవీందర్, ఆర్ఐ ప్రభాకర్, కార్యదర్శి మౌనిక, గ్రామస్తులు ఉన్నారు.

ముగ్గురి బైండోవర్

తెలంగాణ చౌక్, ఆగస్టు 30: సిరిసిల్ల పట్టణ తహసీల్ కార్యాలయంలో ముగ్గురిని బైండోవర్ చేయగా, ఒక్కరికీ వారెంట్ జారీ అయినట్లు పట్టణ సీఐ కృష్ణ శుక్రవారం తెలిపారు. సిరిసిల్లకు చెందిన లింగంపల్లి అనిల్ మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేయగా, గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. తీరు మారకపోవడంతో కేసు నమోదుచేసి రూ.15వేల జరిమానా విధించారన్నారు. సుందరయ్యనగర్‌కు చెందిన బల్వీర్‌సింగ్, చంద్రపేటకు చెందిన సంపంగి మల్లమయ్య బెల్టుషాపులు నిర్వహించడం తో బైండోవర్ చేసి రూ.20వేల చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు. సుందరయ్యనగర్‌కు చెందిన తుమ్మల శివకుమార్ శాంతిభద్రతలకు విఘాతం కలిగించగా తహసీల్దార్ వారెంట్ జారీచేసినట్లు చెప్పారు.